సాగుకు అవసరం భూసారం!

● మట్టి పరీక్షలతోనే అధిక దిగుబడులు
● రైతులను చైతన్య పరుస్తున్న వ్యవసాయాధికారులు


పొలంలో మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

బనగానపల్లె: వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతినిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. సచివాలయాలకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పి రైతులకు భరోసా కల్పిస్తుంది. పెట్టుబడి సాయం, సకాలంలోనాణ్యమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులను సరసమైన ధరలకు అందజేయడంతో పాటు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తూ ఆదుకుంటుంది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో వ్యవసాయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ దిశగా పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను చైతన్య పరుస్తున్నారు. మండల వ్యవసాయాధికారితోపాటు రైతుభరోసా కేంద్రాల సిబ్బంది నేరుగా రైతు పొలాల వద్దకు వెళ్లి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. రైతులు సైతం అధికారుల సూచనలు మేరకు భూసార పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) పద్ధతిలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు వ్యవసాయాధికారులు. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో భౌతిక రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయిని గుర్తిస్తారు. బనగానపల్లె నియోజకవర్గంలో వ్యవసాయాధికారుల రికార్డుల ప్రకారం 2.16లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా దాదాపు 40 శాతం భూములకు సంబంధించి మట్టి పరీక్షలు పూర్తయినట్లు సమాచారం.

భూసార పరీక్షల ప్రయోజనాలు

భూసార పరీక్షలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ పరీక్షలతో భూమి సారం తెలుస్తుంది. సంబంధిత భూమిలో ఏ పంట పండించాలి.. ఎరువులు ఎంత మోతాదు వాడాలనే విషయం తెలుస్తుంది. మట్టి పరీక్షలు భూమికి, పంటకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడలు పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి 90శాతం రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నవో లేవో తెలుసుకోకుండానే పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయనికి ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా రైతుకు ఖర్చులు తప్ప దిగుబడులు పెరగడం లేదు. అంతేకాకుండా ఎరువుల మూలంగా భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

సూక్ష్మపోషకాలే కీలకం

అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదు మించి వాడుతున్న రసాయన ఎరువుల మూలంగా భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాషియం ఎక్కువగా వాడడంతో మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్ సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. కర్బణం లోపిస్తే భూమి తన సహజస్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమై పోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

మట్టి సేకరణలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు

పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల పాటు మట్టి సేకరించకూడదు. అదేవిధంగా పంటకు నీరుపెట్టిన తర్వాత నీడపడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలు ఉన్నచోటు, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు. పంట కోత అనంతరం వేసవిలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించాలి. పొలంలో వి ఆకారంలో 15-20 సెంటిమీటర్లు లోతున పారతో గుంతతీసి అందులో పైపొర నుంచి కింది వరకు ఒక్క పక్కగా మట్టిని సేకరించాలి. పొలంలో మొత్తంగా 8-10 చోట్ల సేకరించాల్సి ఉంటుంది.

భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు



భూ సారపరీక్షలు చేయించుకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు లభిస్తాయి. భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ సంవత్సరం కూడా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులను చైతన్య పరుస్తున్నాం. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారంతగ్గి పంటదిగుబడి తగ్గిపోతుంది. ఈ విషయాలను రైతులకు వివరిస్తున్నాం.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి బనగానపల్లె మండలం

క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్షలో గ్రామీణ విద్యార్థికి ఉత్తమ ర్యాంక్


రేవతి

బేతంచెర్ల:ఈనెల 16న జరిగిన మహాత్మా జ్యోతి పూలే గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామానికి చెందిన విద్యార్థిని జీ.రేవతికి 50 మార్కులను గాను 49 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించినట్లు ప్రకృతి విద్యానికేతన్ కరస్పాండెంట్ నర్ల రవికుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన త్రివిక్రమ్ రెడ్డి, అర్చన, శ్రీలత, వెస్లీ, శశాంక్ ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు


మార్కెట్లో తక్కెడలను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ : వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని డోన్ తూనికల కొలతల శాఖ అధికారి ఖాజాహుసేన్ హెచ్చరించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌తోపాటు తోపుడుబండ్లలో వేయింగ్ మిషన్, తకెళ్లు, రాళ్లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్‌సింగ్, తూనికల కొలతల శాఖ సిబ్బంది శ్రీనివాసులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య


ఎస్సార్బీసీ కాలనీలో నీటిని వదులుతున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: స్థానిక ఎస్సార్బీసీ కాలనీలో తాగునీటి సమస్య తీరింది. కొన్నాళ్ల కిందట సమస్యను కాలనీవాసులు వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సొంత నిధులు రూ.3.5లక్షలు వెచ్చించి పైప్‌లైన్,రూ.20వేలతో విద్యుత్ దీపాలు, కరెంటు స్తంభాల మార్పిడి చేయించారు. ఈ మేరకు మంగళవారం పనులు పూర్తకావడంతో గ్రామస్తులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా తాగునీటి కుళాయిలను ప్రారంభించారు.సమస్య తీరడంతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

బనగానపల్లెరూరల్: మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు కోరారు.మంగళవారం మండలంలోని యాగంటిపల్లె, జ్వాలాపురం,బనగానపల్లె గ్రామాల్లోని మామిడి తోటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మామిడి పంటకు మంచి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూసీ మండల కార్యదర్శి సుబ్బయ్య, రైతులు సుద్దమద్దిలేటి, చిన్న మద్దయ్య, రంగడు, గిడ్డయ్య, నాగమద్దిలేటి, వ్యాపారి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి

డోన్: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని సాంబశివాలయంలో స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషావలిశర్మ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుని చిత్రపటానికి అభిషేకాలు, అర్చనలు, మహా మంగళహారతి ఇచ్చి నైవేద్యాన్ని ఇచ్చారు.
బేతంచెర్ల: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలోని శివాలయంలో ఘనంగా ఆది శంకరచార్యుల జయంతి వేడుకలను మంగళవారం గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శంకరాచార్యుల చిత్రపటానికి వేదపండితులు పూలమాలలు వేసి,శివునికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం శంకరాచార్యుల చిత్రపటంను పూల రథంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు నరేష్ శర్మ,గాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు ఈవీ సుజాత శర్మ, అన్నారావు, కృష్ణారావు, శ్రీకాంత్, ఆలయ మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి

డోన్ టౌన్: నూతన జాతీయ విద్యావిధానంపై విద్యార్థులు ఐకమత్య పోరాటాలకు సిద్ధం కావాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టి, శ్రీసుధ విద్యా సంస్థల డైరెక్టర్ సుదర్శన్ పిలుపునిచ్చారు. స్థానిక షాదిఖానాలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా 3వ మహా సభలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరించేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.

అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్:ఐసీడీఎస్ ప్రాజెక్టు డోన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా (హెల్పర్)పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, మే 1వ తేదీ సాయత్రం 5గంటలలోపు కార్యాలయంలో అందించాలని సీడీపీఓ శంషాద్‌బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ మండలంలోని పెద్ద మల్కాపురం-బీసీ డీ, ప్యాపిలి మండలం మాదినేనిదొడ్డి ఆయా-ఈడబ్ల్యూస్, ప్యాపిలి 2,ఆలేబాద్ గ్రామాలు- ఓసీలకు, బేతంచెర్ల ముద్దవరం గ్రామానికి బీసీ ఏ క్యాటిగిరిలకు కేటాయింపు జరిగిందని,మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు..

వాహనాల తనిఖీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మంగళవారం సాయంత్రం ఎస్ఐ నవీన్‌బాబు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్స్ సక్రమంగా లేని 22 మంది వాహనచోదకులపై కేసు నమోదు చేసి రూ.5170 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వ్యక్తి తోపాటు వాహనం నడుపుతున్న మరొకరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడికి సాహిత్య సేవ అవార్డు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సత్తెనపల్లె బాబుకు సాహిత్య సేవ అవార్డు లభించింది. అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అవార్డులప్రధానోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు బాబు రచించిన బసవపురాణం ఒక పరిశీలన, వీరశైవ సాహిత్యం సామాజిక దృక్పథం అనే అంశాలపై రాసిన రచనలకు సాహిత్య సేవ అవార్డు లభించిందని ఆయన తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: దోమలు మూలంగా సోకే ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాసాగర్, రాబర్ట్ కెనడి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 'దోమ పుట్టరాదు.. దోమ కుట్టరాదు' అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, మెదడువాపు వ్యాధి, చికున్‌గున్యా, మలేరియా తదితర జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్‌ఆఫీసర్ విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
బనగానపల్లెరూరల్: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని రాళ్లకొత్తూరుతాండ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు మలేరియా వ్యాధి దోమకాటు మూలంగా వస్తోందన్నారు. దోమ కుట్టిన సుమారు 15 రోజుల తరువాత చలితో కూడిన జ్వరం, వాంతులు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అమ్మవారిశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా వైద్యురాలు సౌమ్య ప్రియ సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జ్యోతి, ఏఎన్ఎమ్‌లు మునేశ్వరీ, రేణుక, తిప్పమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
అవుకు: జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ దోమల నుంచి సోకే మలేరియా కట్టడికి ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, వేణుగోపాలరాజు, మల్లేశ్వరి, తెరిసమ్మ, దానమ్మ, ఏఎన్ఎంలు వెంకటేశ్వరమ్మ, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.
ప్యాపిలి: మలేరియా నిర్మూలనకు అందరూ పాటుపడాలని ప్యాపిలి వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బంది ప్యాపిలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు.


ఉప్పలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


బేతంచెర్ల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాటమీద నిలబడేవ్యక్తి జగనన్న

● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


మీరాపురంలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ఇచ్చిన మాట మీద నిలబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇంత వరకు 98శాతం అమలు చేశారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీరాపురం గ్రామంలో రెండవ రోజు మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తలారినాగేశ్వమ్మ, ఎంపీటీసీ మారంలక్ష్మీదేవి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే కాటసానితో మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో ఎటువంటి పథకాలు లభించలేదన్నారు. సీఎం జగన్ పాలనలో ఇచ్చిన హామీలన్నియూ నేరవేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు లభించనివారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వారికి వెంటనే ఆ పథకాలు లభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో సీఎం జగన్ ప్రభుత్వం జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న పాలనలో బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు సంతోషంగా ఆత్మగౌరవంతో జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.13,500 ఇస్తుండగా ఆర్‌బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు అన్ని సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల అవినీతి వల్ల అర్హులైన ప్రజలకు న్యాయంగా అందాల్సిన సంక్షేమ పథకాలు వారికి చేరలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, మండల ఏఈ రమణ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సీతారామ్‌రెడ్డి, హుస్సేన్‌సా, సుభాన్, బసప్ప, రామచంద్రారెడ్డి, పల్లె మదర్‌సా, రమణారెడ్డి, ఆర్‌నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పందులను జనావాసాలకు దూరంగా ఉంచాలి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సంచరిస్తున్న పందులను జనావాసాలకు దూరంగా ఉంచాలని ఎస్ఐ వెంకటరెడ్డి, ఈఓపీఆర్డీ రాధిక సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో పందుల పెంపకందారులతో సమా వేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పందుల సంచారంతో సోకే ప్రాణాంతక వ్యాధులు, పారిశుద్ధ్యం లోపిస్తున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పందుల పెంపకం దారులు అధికారులతో సహకరించి రెండు, మూడు రోజులు గడువు తీసుకుని పందులను పట్టణంలో సంచరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచా యతీ ఈఓ బాలాంజనేయులు, గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బనగానపల్లె నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమ లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఐదు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ న ప్రారంభమైన కార్యక్రమం 29వతేదీన ముగియనుందన్నారు. ఇప్పటి వరకు బనగానపల్లె నియోజకవర్గం మూడవ స్థానంలో ఉందని, గడువు ముగిసేలోగా మొదటి స్థానానికి చేరుకునేందుకు ప్రతి ఒక్క రూ శ్రమించాలని పేర్కొన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన ప్రతి ఇంటిని సందర్శించి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించి 8296082960కు మిస్డ్‌కాల్ ఇచ్చే ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వలంటీర్ల మండల కో ఆర్డినేటర్ రమేష్,సచివాలయ కన్వీనర్లు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గజ్జెలరెడ్డి, దశరథరామిరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

29న గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి మౌఖిక పరీక్ష

నంద్యాల(సిటీ): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) కోర్సులకు కంప్యూటర్ సబ్జెక్టును బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులను గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శశికళ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంటెక్ తదితర విభాగాల్లో కంప్యూటర్ సైన్స్ ప్రధాన సబ్జెక్టుగా కలిగిన వారు పోస్టుకు అర్హులన్నారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే మౌఖిక పరీక్షలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985883900 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సిమెంట్ నగర్ గ్రామ పంచాయతీకి అవార్డు

బేతంచెర్ల: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ సిమెంట్ నగర్‌కు సుపరిపాలన అవార్డు దక్కింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ ఎస్తేరమ్మ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరన్న సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జీలానీ సామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తులు సర్పంచ్ ఎస్తేరమ్మ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరన్నను అభినందించారు.

రేపు వెంకటేశ్వర స్వామికి లక్ష మల్లెపూల అర్చన

డోన్: ఈనెల 27వ తేదీ గురువారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెపూల అర్చ న ఉంటుందని ఆలయ పురోహితులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మలు తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

కుమారస్వామికి శేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓ.ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామ సమీపంలో ఐదుగురు పేకాటాడుతుండగా మంగళవారం అరెస్ట్ చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన లింగన్న, నాగరాజు, సంజీవరాయుడు, ప్రసన్న కుమార్, జాకీర్ పెద్దమ్మ ఆలయం వద్ద అందర్ బహార్ ఆడుతున్నారని సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి రూ.7,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

నంద్యాల(వ్యవసాయం): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని కోరుతూ జిల్లా జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్ శాఖ అధికారులకు కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ తూము శివారెడ్డిలు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి


పేరుసోములలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

సంజామల(కోవెలకుంట్ల): నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరైన పక్కా గృహాలను లబ్ధిదారులు పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం సంజామల మండలం పేరుసోమల, రామిరెడ్డిపల్లె, నొస్సం గ్రామ శివారుల్లోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలంతోపాటు పక్కాగృహాలు మంజూరు చేసిందన్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు విడతల్లో రూ. 1.80 లక్షలు, రాయితీపై 504 కిలోల కడ్డీలు, 120 బస్తాల సిమెంట్, ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తోందన్నారు. పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బనగానపల్లెరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పట్టిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం కింద చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ సూచించారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల మండలాలకు చెందిన గ్రామ సచివాయాల సర్వేయర్లు, వీఆర్ఓలకు రీసర్వేపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగమని, భూ సమస్యలు ఉంటే అక్కడే అధికారుల సమక్షంలో పరిష్కారమవుతాయన్నారు. గ్రామాల్లో దండోర ద్వారా రైతులకు తెలియజేయాలని, రైతుల సమక్షంలోనే హద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డోన్ డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ చంద్రశేఖర్ రీ సర్వేలో వీఆర్ఓ, సర్వేయర్ల పాత్ర, సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బొమ్మలసత్రం: ఆధార్, వ్యక్తిగత సమాచారం, వేలిముద్రల ఆధారంగా సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయం చేస్తున్నారని , ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖాతాల నుంచి నగదు మాయమవుతుందనే ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు నగదు అవసరమైతే ఏటీఎం కార్డు అవసరం లేకుండా ఏటీఎమ్‌లో నగదు పొందేందుకు ప్రభుత్వం ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల ఆధార్ వివరాలు, వేలిముద్రలు సేకరించి నగదు మాయం చేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆధార్‌ను లాక్ చేసి ఉంచుకోవాలన్నారు. దీని వల్ల అకౌంట్ నుంచి నగదు మాయం కాదన్నారు.